ఓం శాంతి

నిమిత్త టీచర్లు మరియు బ్రాహ్మణ కుల భూషణ సోదరీ సోదరులకు మధుర స్మృతిపత్రము (18-7-16)

పరమ పవిత్రులు, పరమ ప్రియులు అయిన బాప్‌దాదాకు అతి అల్లారుముద్దు పిల్లలు, సదా అతీంద్రియ సుఖపు ఊయలలో ఊగేవారు, ప్రభు పాలనలో పాలింపబడేవారుగా అయ్యి విశ్వ కళ్యాణ సేవలో ఉపస్థితులైన సర్వ నిమిత్త టీచర్లు మరియు దేశ విదేశములలోని పరమాత్మ స్నేహులైన విశ్వ సేవాధారులైన సోదరీ సోదరులు, ఈశ్వరీయ స్నేహ సంపన్నమైన మధుర ప్రియస్మృతులతోపాటు రక్షాబంధనము మరియు జన్మాష్టముల పావన పర్వములకు మీకందరికీ చాలా చాలా హార్దిక అభినందనలు.

విశ్వ రక్షకులైన ప్రియమైన బాప్‌దాదా మనందరినీ స్నేహముతో కూడిన ఎటువంటి పవిత్ర రక్షాసూత్రములో బంధించారంటే బాబా పిల్లలు ప్రతి ఒక్కరూ స్వ రక్షకులు, మర్యాదా రక్షకులు, పరివార రక్షకులు మరియు విశ్వ రక్షకులుగా అయ్యారు. మొత్తము సృష్టిచక్రములో సంగమములోని ఈ 100 సంవత్సరాలు ఎంత బాగున్నాయి! ప్రపంచములోనే ఉంటున్నాగానీ ప్రపంచము నుండి అతీతులు మరియు బాబాకు ప్రియులు, వ్యక్తి-వైభవాల ఆకర్షణకు లొంగిపోవటము నుండి ఫ్రీ అయిపోయారు. సత్యత మరియు ప్రేమల భండారా సదా నిండుగా ఉంటుంది, కనుక కలహ-క్లేశాలు అన్నీ దూరమైపోతాయి. ఇంకా మన బాబా కర్మల గుహ్యగతిని ఎంత మంచిగా తెలియజేస్తారు! పిల్లలు ఏ కర్మ చేసినాగానీ నేను ఎటువంటి కర్మ చేస్తానో, నన్ను చూసి ఇతరులు చేస్తారు అన్న ధ్వని వారి లోపల నుండి వెలువడాలి. కర్మ చాలా బలపూరితమైనది, బాబా సర్వ శక్తివంతులు. స్వయంగా భాగ్యవిధాత మన సహచరుడైపోయారు మరియు మొత్తము జ్ఞాన సారము - నువ్వు సాక్షిగా అయ్యి నీ పాత్రను అభినయించు. మధురమైన బాబా మాటలు ఏవైతే ఉన్నాయో అవి జీవితంలో చాలా ఉపయోగకరమైనవి. అంతర్ముఖి సదా సుఖి అన్నదానిని బాబా నేర్పించారు. బాహ్యర్ముఖతలో టైమ్ వేస్ట్ అయిపోతుంది. సంగమయుగములోని ఇప్పటి ఈ సమయము చాలా సంపాదన చేసుకునే సమయము. ఏ కార్యవ్యవహారములోనైనా ధనాన్ని, సమయాన్ని వేస్ట్ చెయ్యకూడదు. ఒక్కరి పేరు మీద ఎకానమీ ద్వారా ఇంత పెద్ద యజ్ఞము నడుస్తూ ఉంది. బాబా ఒక్కరే కానీ చాలా గొప్ప అద్భుతమైనవారు. మనకు పప్పు-రొట్టె తప్ప ఇంకేమన్నా కావాలా? కేవలము సింపుల్‌గా ఉంటూ స్యాంపుల్‌గా అవ్వాలి. సింపుల్‌గా ఉండటము అనగా సదా సంతుష్టంగా ఉండటము. అన్ని గుణాలలోకీ సంతుష్టంగా ఉండే గుణము చాలా విలువైనది. సదా సంతుష్టము, నో ప్రాబ్లమ్. ప్రతి కార్యమూ సఫలమవుతూ ఉంది. కేవలము మనము ఒకరినొకరు చూసుకుంటూ లైట్‌గా అవ్వాలి, మైట్ ఆకర్షించాలి మరియు మన ద్వారా బాబా ఏదైతే కార్య వ్యవహారములు చేయిస్తున్నారో అది సూచనల ద్వారా జరుగుతూ ఉండాలి.

చూడండి, ఇప్పుడు మన ట్రావెలింగ్ పాత్ర పూర్తయిపోయింది. ఇప్పుడు శాంతివనములో కూర్చుని విశ్వములో శాంతిని వ్యాపింపచెయ్యాలి. మీరందరూ ఏం చేస్తున్నారు? సేవనైతే మంచిగా చెయ్యండి, మీరు చెయ్యకపోతే ఎవరు చేస్తారు! నేను ముందు ఎంత చేసేదానినో అంత ఇప్పుడు చెయ్యటం లేదు. ఇప్పుడు కూడా రక్షాబంధనము నాడు అందరూ పవిత్రులు మరియు యోగులుగా అయ్యే శుభ సందేశమును ఇస్తూ మీరు రాఖీ కడతారు. దీని ద్వారా ఎంతమంది ఆత్మలు స్నేహ సంబంధములోకి వస్తారు! మీరందరు కూడా మాకు స్నేహపూర్వకముగా చాలా మంచి మంచి రాఖీలను పంపించారు. ఇక్కడ కూడా చాలా మంది సోదరీమణులు ప్రేమతో మిలనము చేసుకుంటూ రాఖీని కట్టుకుని వెళ్ళారు, రిటర్న్‌గా అందరికీ బాప్‌దాదా మరియు దాదీల ఆశీర్వాదాలు లభిస్తూ ఉంటాయి. మధురమైన బాబా ఎంతటి సుందరమైన అలౌకిక పరివారాన్ని తయారుచేసారు! అందరినీ చూస్తూ-చూస్తూ మనసు సంతోషముతో పొంగిపోతుంది. లోపల నుండి ఈ పాట వెలువడుతూ ఉంది.... జిస్‌కీ రచనా ఇతనీ సుందర్ వహ్ కితనా సుందర్ హోగా (ఎవరి రచన అయితే ఇంత సుందరమైనదో, మరి వారింకెంత సుందరంగా ఉండవచ్చు!)....... వాహ్ బాబా! వాహ్ మీ అలౌకిక రచన, వాహ్! అవ్యక్త వతనములో ఉన్నా కూడా బాబా తన పిల్లలను ఎలా సంభాళిస్తారు! సకాష్ ఇస్తారు! శక్తి నింపుతారు! దేశ విదేశాలలో దూరంగా ఉన్న పిల్లలు కూడా బాబా దివ్య పాలన యొక్క అనుభవమును చేస్తూ స్వయమును సమర్థ శక్తిశాలులుగా తయారుచేసుకుని అనంతమైన సేవలను చేస్తున్నారు. అన్నివైపుల నుండి చాలా మంచి మంచి సమాచారాలు లభిస్తూ ఉంటాయి.

అచ్ఛా - ఇప్పుడైతే మన నూతన స్వర్ణిమ ప్రపంచము రానే వస్తుంది. అందరూ ఎంత సంతోషము, ఉల్లాసములతో భవిష్య రాజకుమారుడైన శ్రీకృష్ణుని జన్మదినాన్ని జరుపుకుంటారు, రాసలీల చేస్తారు! మరి అటువంటి పావన పర్వ దినమైన జన్మాష్టమికి మీకందరికీ చాలా చాలా అభినందనలు, అభినందనలు.

ఈశ్వరీయ సేవలో
బి.కె. జానకి దాది.

# అవ్యక్త ప్రేరణలు

## “మాస్టర్ దయాళురు, కృపాళురుగా అవ్వండి”

1. ఆపదలతో కూడిన నేటి సమయంలో దుఃఖిత, అశాంత ఆత్మలు పరమాత్మతోపాటు శక్తులను, దేవతలను గుర్తు చేస్తారు! వీరిలో కూడా గణేశుడిని మరియు హనుమంతుడిని ఎంత ఎక్కువగా గుర్తు చేస్తారు! హే కృపాళు, దయాళు, దయ చూపించు, కృప చూపించు, నీటి చుక్కంత సుఖశాంతులనైనా ఇవ్వు అని ప్రతిరోజూ పిలుస్తారు. కనుక ఓ శక్తులారా, ఓ దేవిలారా – దుఃఖితుల, దప్పికతో ఉన్న ఆత్మల పిలుపును వినండి. మీ సోదరీ సోదరులపై దయ చూపించండి.
2. ఓ మాస్టర్ ముక్తిదాతలారా, ఇప్పుడు అన్నింటికంటే ముందు స్వయముకు ముక్తిని ఇవ్వండి, తరువాత విశ్వములోని సర్వ ఆత్మలకు ముక్తిని ఇచ్చే అంచలిని ఇవ్వండి. వారు పిలుస్తూ ఉన్నారు, దుఃఖితులపై కాస్త దయ చూపించండి అని పదే-పదే గీతమును ఆలపిస్తున్నారు. దుఃఖము పెరుగుతూనే ఉంది, కనుక వారిపై దయ చూపించి వారిని ముక్తిధామానికి పంపండి, ఇందుకొరకు వాణి సేవతోపాటుగా మనసా సేవను పెంచండి.
3. మీ జడ చిత్రాలు కూడా దయాహృదయులు, ఏ చిత్రాల ముందుకు వెళ్ళినాగానీ – నాపై దయ చూపించండి, కృప చూపించండి, జాలి చూపించండి, దయ, దయ...... అనే అడుగుతారు. చిత్రాలే ఇంతటి మెర్సిఫుల్ అయినప్పుడు ఇక చైతన్యములో ఎలా ఉంటారు! చైతన్యములో అయితే దయాహృదయ గనులు. మొదట మీపై దయ చూపించుకోండి, తరువాత బ్రాహ్మణ పరివారముపై దయ చూపించండి, ఒకవేళ ఎవరైనా పరవశులుగా, సంస్కారవశులుగా, బలహీనులుగా ఉన్నట్లయితే ఆ సమయములో స్పృహ లేనివారుగా అయిపోతారు, కనుక క్రోధము చెయ్యకండి, కృపాళురుగా అవ్వండి.
4. బాప్‌దాదాకు అతి అల్లారుముద్దు పిల్లలారా, పదమాపదమ వరదానాల వరదానీ పిల్లల్లారా! ఇప్పుడు సంకల్పమును దృఢముగా చెయ్యండి మరియు దృఢత అనే తాళపుచెవిని పెట్టండి, కర్మయోగులుగా అవ్వండి. కర్మయోగీ జీవితము కలవారు, జీవితము సదాకాలము ఉంటుంది, అప్పుడప్పుడు ఉండేది కాదు. కనుక ఇప్పుడు మీ కృపాళు, దయాళు, దుఃఖహర్త-సుఖకర్త స్వరూపమును ఇమర్జ్ చేసుకోండి.
5. బాప్‌దాదా అచానక్ (అకస్మాత్తు) అన్న పాఠాన్ని బహుకాలము నుండి చదివించారు. కనుక అకస్మాత్తుకు ముందు భక్తుల పిలుపును పూర్తి చెయ్యండి. దుఃఖితుల దుఃఖపూరిత వ్యథలను వినండి. ఇప్పుడు చిన్నవారు, పెద్దవారు ప్రతి ఒక్కరూ తమను విశ్వ పరివర్తనకు, విశ్వములోని దుఃఖాన్ని పరివర్తన చేసి సుఖ ప్రపంచమును తీసుకువచ్చేందుకు బాధ్యులుగా భావించండి.
6. ఓ నా హృదయ సింహాసనాధికారీ ప్రియమైన పిల్లలారా! ఇప్పుడు భక్త ఆత్మల దప్పికను తీర్చండి అని బాప్‌దాదా మనసులో సమయానుసారంగా ఈ ఆవశ్యకతయే అనిపిస్తుంది. మా పూజ్యులారా, మా దయాళురు, కృపాళులారా, ఎక్కడ ఉన్నారు, మా పిలుపు వినిపించటం లేదా? కాస్తంత సంతోషము, కాస్తంత శాంతి యొక్క అంచలిని ఇవ్వండి అని పాపం, ఆ ఆత్మలు పూజ్య ఆత్మలను గుర్తు చేస్తున్నాయి. కనుక ఇప్పుడు పిలిచేవారికి అంచలిని ఇచ్చే సమయము, మనసా సేవ చేసే సమయము వచ్చింది. అందుకే మొత్తము రోజులో శక్తిశాలీ స్మృతి యొక్క శాతమును పెంచండి.
7. భిన్న-భిన్న సమస్యల కారణంగా, మనసు-బుద్ధి సమతుల్యంగా లేని కారణంగా బాబాను మరియు తమ తమ మాన్యతలవారిని దయ కొరకు చాలా దుఃఖముతో, అలజడితో పిలుస్తారు. దయాళువు బాబా తన పిల్లలతో – బాబా యొక్క సహయోగి, సహచర భుజాలైన మీరు బ్రాహ్మణులు మాస్టర్ దయాళురుగా అవ్వండి అని అంటారు.
8. అందరూ మీ సోదర సోదరీమణులే, వారు సొంతవారైనా లేక సవతివారైనాగానీ ఉన్నదైతే అందరూ మీ పరివారము వారిగానే. మీ పరివారములోని అజ్ఞానులు, వ్యాకుల ఆత్మలపై దయాహృదయులుగా అవ్వండి. మనసు లోతుల నుండి దయ రావాలి. విశ్వములోని అజ్ఞాన ఆత్మల కొరకు కూడా దయ కావాలి మరియు తోడుతోడుగా బ్రాహ్మణ పరివార పురుషార్థపు తీవ్రగతి కొరకు మరియు స్వ ఉన్నతి కొరకు దయాహృదయము అవసరము.

9. దయాసాగరులైన బాబా సంతానంగా అయిన నేను ఎంతమంది ఆత్మలపై దయ చూపించాను అని స్వయాన్ని పరిశీలించుకోండి. కేవలము వాణి ద్వారానే కాదు, మనసా వృత్తి ద్వారా, వాయుమండలము ద్వారా కూడా ఆత్మలకు బాబా ద్వారా లభించిన శక్తులను ఇవ్వండి. కొద్ది సమయములోనే మొత్తము విశ్వ సేవను సంపన్నము చెయ్యవలసి ఉన్నప్పుడు దానిని తీవ్ర గతితో చెయ్యండి. స్వయాన్ని ఎంతగా సేవలో బిజీగా ఉంచుకుంటారో అంతగానే స్వయము సహజంగానే మాయాజీతులుగా అయిపోతారు.

10. ప్రతి సమయము ప్రకృతి తన సిగ్నల్‌ను చూపిస్తూ ఉంది. కనుక ప్రకృతిలో ఎంతగా అలజడి ఉంటుందో అంతగానే మీ అచల స్థితి ప్రకృతిని పరివర్తన చేస్తుంది. ప్రతి సమయము ఎంతమంది ఆత్మలు దుఃఖ ప్రవాహములోకి వస్తున్నారు! మరి అటువంటి దుఃఖిత ఆత్మలకు ఆధారమైతే బాబా మరియు మీరే కదా! కనుక దయ చూపించవలసి ఉంటుంది కదా. ప్రకృతి అలజడివలన ఆత్మలు అరుస్తున్నారు, దయను కోరుకుంటూ ఉన్నారు, మరి మీకు వారి దయాపూరిత పిలుపు చేరుకుంటుంది కదా! ఈ చిన్న-చిన్న ఆపదలు ఇంకా విలవిలలాడిస్తాయి, ఇందుకొరకు బ్రాహ్మణ ఆత్మలైన మీరు సంపన్నులుగా అయినట్లయితే దుఃఖ ప్రపంచము సమాప్తమైపోతుంది.

11. ఇప్పుడు పరివర్తన యొక్క శుభ భావనను తీవ్రము చెయ్యండి. మీరు కూడా ఒక్కోసారి ఒక్కోలా ఉన్నట్లయితే ప్రకృతి కూడా ఒక్కోసారి చాలా ఎక్కువ తీవ్రగతితో కార్యము చేస్తుంది, ఒక్కోసారి చల్లబడిపోతుంది కనుక ఇప్పుడు స్వయము కొరకు మరియు సర్వ ఆత్మల కొరకు దయా భావనను ఇమర్జ్ చేసుకోండి. ఈ దయా భావన ద్వారా విఘ్నాలు కూడా సహజంగానే సమాప్తమైపోతాయి. ఎక్కడ దయ ఉంటుందో అక్కడ నీది-నాది అనే అలజడి ఉండదు. కనుక ఇప్పుడు ఈ అలను వ్యాపింపచెయ్యండి. ప్రతి సంకల్పములో దయాళురుగా ఉండాలి.

12. మీ సోదరీ సోదరులపై కూడా దయహృదయులుగా అవ్వండి, దయాహృదయులై సేవ చేసినట్లయితే అందులో నిమిత్త భావము స్వతహాగానే ఉంటుంది. ఎవరు ఎంత చెడ్డవారైనాగానీ ఒకవేళ మీకు ఆ ఆత్మపట్ల దయ ఉన్నట్లయితే మీకు వారిపట్ల ఎప్పుడూ కూడా ద్వేషము లేక ఈర్ష్య లేక క్రోధములతో కూడిన భావన రాదు. దయాభావన సహజమైన నిమిత్తభావమును ఇమర్జ్ చేస్తుంది.

13. దయాహృదయుడైన బాబా పిల్లలైన మీరు ఇప్పుడు అనంతముగా దయ చూపించండి. ఇతరులపై దయ కలిగినప్పుడు మొదటగా తమపై తమకు దయ వస్తుంది, అప్పుడు ఒక చిన్న విషయము గురించి కూడా మీరు ఏదైతే పురుషార్థము చెయ్యవలసివస్తుందో అది చేసే అవసరము ఉండదు. మాస్టర్ దయాహృదయులు, మాస్టర్ దయాళురుగా అవ్వండి. ఈ గుణాన్ని ఇమర్జ్ చేసుకున్నట్లయితే ఇతరులపై దయ చూపించటం ద్వారా స్వయంపై దయ దానికదే వస్తుంది.

14. ఈ సమయంలో మీరు ప్రతి ఒక్క ఆత్మపట్ల దయాహృదయులు మరియు దాతలుగా అయ్యి ఏదో ఒకటి ఇవ్వవలసిందే, మనసా సేవ ద్వారానైనా ఇవ్వండి, శుభ భావనల ద్వారానైనా, శ్రేష్ఠ సకాష్‌ను ఇచ్చే వృత్తి ద్వారానైనా, ఆధ్యాత్మిక శక్తిసంపన్నమైన మాటల ద్వారానైనా, మీ స్నేహ సంపన్న సంబంధ-సంపర్కముల ద్వారానైనా ఇవ్వండి కానీ ఏ ఆత్మ కూడా వంచితమై ఉండకూడదు. దాతలుగా అవ్వండి, దయాహృదయులుగా అవ్వండి.

15. బాప్‌దాదా ఇప్పుడు పిల్లలు ప్రతి ఒక్కరి దయా స్వరూపాన్ని చూడాలని అనుకుంటారు. ఇప్పుడు మీ హద్దు విషయాలను వదిలెయ్యండి, దయాళురుగా అవ్వండి. మనసా సేవలో మునిగిపోండి. సకాష్ ఇవ్వండి, శాంతి ఇవ్వండి, ఆధారాన్ని ఇవ్వండి. ఒకవేళ దయాళురుగా అయ్యి ఇతరులకు ఆధారాన్ని ఇవ్వటంలో బిజీగా ఉన్నట్లయితే హద్దు ఆకర్షణల నుండి, హద్దు విషయాల నుండి స్వతహాగానే దూరమైపోతారు. కష్టపడటము నుండి దూరమవుతారు.

16. ఇప్పుడు ప్రపంచము ఎంత అధోగతివైపుకు వెళ్తూ ఉందో మీరు ప్రపంచ పరిస్థితిని చూస్తూనే ఉన్నారు. ఇటువంటి సమయములో పిల్లలు ప్రతి ఒక్కరూ సదా దయాస్వరూప స్థితిలో స్థితులై ఆత్మకు శుభ భావన, శుభ కామనలు, స్నేహము మరియు దయా భావనలతో సకాష్‌ను ఇవ్వాలి, అప్పుడు అందరి కళ్యాణము జరుగుతుంది. స్వ సేవ మరియు విశ్వ సేవల బ్యాలెన్స్ ద్వారా అందరికీ ముక్తి యొక్క ఆశీర్వాదాలను ఇప్పించండి. పిల్లల్లారా, ఇప్పుడు విధాతలుగా అవ్వండి, సేవ లేకుండా ఒక్క క్షణం కూడా గడిచిపోకూడదు. నిరంతర సేవాధారులుగా అవ్వండి.